క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పిల్లలు వేసిన డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శశికళ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు, తల్లులు హాజరుతో పాటు అంగన్‌వాడీ స్టాక్‌ను పరిశీలించారు. పిల్లలతో డ్రాయింగ్ వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో కిచన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆరోగ్యలక్ష్మి ఒక్కపూట భోజనం నాణ్యతగా అందించాలన్నారు. అర్హులందరికి పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. కేంద్రాల నిర్వాహణలో నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కమల ఉన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్: 'వృథాగా తాగు నీరు' అనే కథనం 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని 7వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ శుక్రవారం తమ సిబ్బందిని అక్కడికి పంపి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

కృతజ్ఞతలు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో మెడికల్ మంజూరు కోసం కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఈనెలలో శ్రీకారం చుడుతామని చెప్పడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మంత్రి, సీఎం కేసీఆర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీలు ఐక్యంగా ముందుకెళ్లాలి



సభ్యత నమోదు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): పద్మశాలీలు ఐక్యంగా ముందుకు వెళ్లినప్పుడే అన్ని రంగాల్లో విజయం సాధించేందుకు ఆస్కారం ఉందని రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మ్యాడం బాబురావు అన్నారు. శుక్రవారం శివ్వంపేటలో సంఘం సభ్యత నమోదు పుస్తకాలు సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మ్యాకల జయరాములు, మాజీ ఎంపీటీసీ వీరమణిరాజలింగం, సంఘం నాయకులు వెంకటనారయణ, రాంచంద్రం, శివనారాయణ తదితరులు ఉన్నారు.

14న శివపార్వతుల కల్యాణం

నర్సాపూర్: ఈనెల 14న శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని అర్చకుడు వీరప్పగురూజీ చెప్పారు. శుక్రవారం ఆలయంలో శివదీక్షదారులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల పరిశీలన

రామాయంపేట(మెదక్): మన ఊరు- మన బడి కార్యక్రమం కింద పనులు కొనసాగుతున్న మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి నీలకంఠం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన పోచయ్యకు వైద్య ఖర్చుల కోసం రూ.95 వేల ఎల్‌ఓసీని సర్పంచ్ మంచాల లక్ష్మణ్ గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందించారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముప్పారం గ్రామానికి చెందిన శివస్వాములు శుక్రవారం శ్రీశైలానికి పాదయాత్రతో తరలి వెళ్లారు.

పన్నుల వసూలులో నిర్లక్ష్యం వద్దు

- ఉదయం నుంచే వార్డులు తిరగాలి
- మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పన్నుల వసూలుకుగాను ప్రత్యేకంగా టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఎట్టిపరిస్థితుల్లో వంద శాతం పన్నుల వసూలు కావాలని, ఈమేరకు ప్రతిరోజు ఉదయమే పట్టణంలో పర్యటించాలని ఆయన సూచించారు. ఈవిషయమై నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని చైర్మన్ హెచ్చరించారు. టార్గెట్ మేరకు పన్ను వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, మేనేజర్ శ్రీనివాస్, బిల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గుర్తింపు లేదు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



అనందరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

శివ్వంపేట(నర్సాపూర్): ప్రత్యేక తెలంగాణ కోసం కష్టపడిన ఉద్యమకారులకు రాష్ట్రం ఏర్పడిన తర్వాత గుర్తింపు లేదని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం శివ్వంపేటకు వచ్చిన సందర్భంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు అనందరావు ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వల్దాస్ మల్లేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

గ్రామగ్రామాన బీజేపీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న విఠల్

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగరవేసేలా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వీరోజీపల్లిలో గ్రామశక్తి కేంద్రంలో నిర్వహించిన ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పేద ప్రజలకు అందిస్తున్న పథకాలపై ప్రజలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఓబీసీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, బాబురాథోడ్, కృష్ణ, వెంకట్, కిషన్, సాయిలు తదితరులున్నారు.

ముగిసిన శ్రీరామచంద్ర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని లాలు తండాలో నిర్మించిన శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, శ్రీ సీతారామ చంద్ర స్వామి కల్యాణంతో విగ్రహ ప్రతిష్ఠ పూజలు ముగిశాయి. పూజల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌గుప్తా, మధుశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆందోల్ మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్, నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, ఓబీసీ జిల్లా నాయకుడు రమేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, అరవింద్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం



చేగుంట(తూప్రాన్): హోమం చేస్తున్న భక్తులు



కొల్చారం(నర్సాపూర్): రాంపూర్‌లో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని హనుమాన్ దేవాలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ విగ్రహానికి చందన అలంకరణ, శివలింగ అభిషేకం, భవానీ రామలింగేశ్వర స్వామి కల్యాణం, హోమం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రమౌళి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వార్డుమెంబర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాంపూర్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, అమ్మవారికి మంజీరా జలాలతో అభిషేకం, అలంకరణ నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో అమ్మవారి కల్యాణం చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

'ఆ దుకాణాలకు రీ టెండర్ వేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుల

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పటేల్‌కుంటలో ఉన్న మున్సిపల్ దుకాణాలకు వెంటనే రీ టెండర్ వేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కబ్జాలో ఉన్న 17 దుకాణాల సంకెళ్లు నేటికి తెగిపోయాయన్నారు. అలాగే బినామి దుకాణాలను ప్రస్తుతం అధికారంగా రద్దు చేసి, ఖాళీ చేయించిన తర్వాతే ఓపెన్ టెండర్లు పిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు ప్రభాకర్, ప్రవీణ్, కృష్ణ, కుమార్, సుందర్, యేసు, మహేష్, మహేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న సర్పంచ్ సునీత

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రజాక్‌పల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామసభలో మద్యం అమ్మరాదని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో సంపూర్ణ మద్యపానం నిషేధం విధించామన్నారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ. 5 వేలు, కొన్నవారికి రూ. 2 వేలు జరిమానా విధిస్తామన్నారు. మద్యపాన నిషేధానికి సహకరించిన యువజన, మహిళా సంఘాలకు గ్రామ పంచాయతీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గీతాంజలి, గ్రామ వార్డు సభ్యులు రాజు, స్వామి, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శుక్రవారం దళిత సంఘాల నాయకులు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ లక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జనగామ స్వామి, ఏసు రాములు, చంద్రం, రామస్వామి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్

కొల్చారం(నర్సాపూర్): మండలం పరిసర గ్రామాల్లో శుక్రవారం సినిమా షూటింగ్ నిర్వహించారు. ప్రముఖ సినిమా దర్శకుడు తరుణ్ భాస్కర్ ఆధ్వర్యంలో త్వరలో సినిమా షూటింగ్ పూర్తయి, విడుదల కానున్న నూతన చిత్రం -కీడాకోళ్ల సినిమా ఫైటింగ్ దృశ్యాలను చిత్రీకరించారు. మండలంలోని తుక్కాపూర్ ఎస్కేపల్లి బ్రిడ్జి పైనా, మెదక్ – జోగిపేట ప్రధాన రహదారి వరిగుంతం వెళ్లే రహదారిపై చిత్రీకరణ చేపట్టారు. దీంతో షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. డైరెక్టర్‌తో పాటు స్టంట్ మాస్టర్స్, కెమెరా మెన్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర



గ్రామస్తులతో దేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): బోనాల కొండాపూర్ గ్రామంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి సింగరాయకొండ గుడి వద్ద మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని (కే) వెంకటాపూర్(కె) గ్రామస్తులు ఎడ్లబండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి హాజరై గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకొని, ఎడ్లబండ్ల శోభయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్దరాములు, గ్రామ సర్పంచ్‌లు అనిల్ కుమార్, అమరసేనారెడ్డి, గేమ్‌సింగ్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, సిద్దరాములు, బాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు దయాకర్, సత్యనారాయణరెడ్డి, ముత్యాల మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ స్థల పరిశీలన



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట బైపాస్ రోడ్డు వద్ద శివాజీ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. శుక్రవారం సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా కార్యదర్శి రాంసింగ్, వార్డు మెంబర్లు సూరిబాబు, మహేశ్, నాయకులు రాజేశ్ తదితరులు ఉన్నారు.

◆ ఆకట్టుకున్న మాక్ పోలింగ్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలోని నవజీవన్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో చేపట్టిన మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఓటరుగా నమోదు, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలపై విద్యార్థులు ప్రత్యక్షంగా భారతదేశ ఎన్నికల వ్యవస్థను గురించి సమగ్రంగా తెలుసుకున్నారు.

◆ ఘనంగా బండ్ల ఊరేగింపు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీకొండాపూర్ గ్రామంలో లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం బండ్లను ఊరేగించారు. సర్పంచ్ బాలనర్సు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు రాజిరెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ నవీన్, శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంకు చెందిన అల్లం సూర్యప్రకాష్‌కు ఒక చేయ్యి లేదు. అయినా కూడా డిగ్రీ పూర్తి చేసి, ప్రస్తుతం సేఫ్ నెట్‌వర్క్ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఓ పేదింటి అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. తన పెళ్లి సందర్భంగా పేద విద్యార్థుల కోసం ఏర్పడిన మా స్వచ్ఛంద సంస్థకు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సంఘటనతో పెళ్లికి వచ్చిన ప్రతీ ఒక్కరు అతన్ని అభినందించారు.

'ఫిట్‌నెస్' కాపాడుకోవాలి



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: పోలీసు సిబ్బంది అనునిత్యం ఫిట్నెస్ కాపాడుకోవాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి సూచించారు. శుక్రవారం ఎస్పీ రోహిణీ ప్రియదర్శి ఆదేశాల మేరకు మెదక్ బాయ్స్ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, ఆర్ఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది చేసిన పి.టి, లాఠీ డ్రిల్ ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్‌తో సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు, దొరికినప్పుడు సిబ్బంది అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యం అన్నారు. మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వర్తించడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. ఫిట్నెస్‌ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్, తూప్రాన్ సీఐ శ్రీధర్, డీసీఆర్‌బీసీఐ దిలీప్, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులు డీజిల్ స్ప్రే చేయొద్దు'

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో పలువురు రైతులు చీడపీడలకు పిచికారీ చేసే మందుల్లో డీజిల్ వాడుతున్నారని, అలా చేయొద్దని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్, చిట్కుల్ గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో కాండం తొలుచు పురుగు, జింక్ లోపాలను గుర్తించామన్నారు. ముఖ్యంగా రైతులు డీజిల్‌ను పిచికారీ చేయడం వల్ల నీటిపై తేటగా ఏర్పడి, మొక్క వేర్లకు గాలి అందక మొక్క చనిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడొద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడొద్దని ఏఈఓ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని తునికి రైతువేదికలో రైతులకు పంటలకు సోకుతున్న తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల రైతు సమన్వయకర్త రామాగౌడ్, జెడ్పీటీసీ కవిత ఆధ్వర్యంలో రైతుబంధు సమితి కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతు సమన్వయ కర్తలు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం



పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులతో ఉపాధ్యాయులు



నిజాంపేట(మెదక్): చల్మెడలో..

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి.. తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ నాగరాణి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. మండలంలోని కాళ్ళకల్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించుకున్నారు. విద్యార్థుల్లో డీఈఓ రాము, డిప్యూటీ డీఈఓగా ఉదయ్ కిరణ్, ఎంఈఓగా శివ, హెచ్‌ఎంగా వేణుమాధవి, విధులు వ్యవహరించారు.

నిజాంపేట(మెదక్): ప్రాథమిక పాఠశాల చల్మెడలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్ ఉన్నత పాఠశాలలో..

'ఉపాధి'లో కూలీల హాజరుశాతం పెంచాలి



మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నీసా

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనుల్లో కూలీల హాజరుశాతం పెంచాలని ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నీసా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోళపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. పనుల్లో ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలని, కూలీల ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎఫ్ఏ శ్రీనివాస్‌రావుకు సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనంతో పాటు నర్సరీని ఆమె పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామకార్యదర్శి కమలకు సూచించారు.

'కంటి వెలుగు'ప్రారంభం



రామాయంపేట(మెదక్): కంటిఅద్దాలు అందిస్తున్న ఎంపీపీ సబిత



కౌడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లిలో ..



శివ్వంపేట(నర్సాపూర్): రెడ్యా తండాలో..

కౌడిపల్లి(నర్సాపూర్): అర్హులందరు వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ రాజు నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దేవులపల్లిలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని జెడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, సర్పంచ్ ప్రమీళ సత్తయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు, నిరుపేదలకు కంటి వెలుగు వరమని చెప్పారు. పలువురికి ప్రభుత్వం ఉచితంగా అందజేసిన అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు రామాగౌడ్, జెడ్పీటీసీ కవిత, సర్పంచ్ ప్రమీళ, ఎంపీటీసీ జ్యోతి, డాక్టర్ రమేశ్, నాయకులు అమర్‌సింగ్, సత్తయ్య, క్యాడం రాజు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని సంఖాపూర్ గ్రామంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ సబిత, సర్పంచ్ సూజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షురాలు సుజాత, ఎంపీటీసీ సత్యనారాయణ, జప్తిశివునూర్ సర్పంచ్ షేక్ షరీఫ్, ఉపసర్పంచ్ కేశవులు, టీఆర్ఎస్ మండల కార్యదర్శి అంచనూరి రాజేశ్, డాక్టర్ కరుణశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ యాదయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరప్ప ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ భారతి కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి చికిత్స విధానాన్ని పరిశీలించారు. ఇందులో సూపర్ వైజర్ వసంత, పంచాయతీ కార్యదర్శి పోచయ్య, ఉపసర్పంచ్ జ్యోతిబాన్సిలాల్, వార్డు మెంబర్లు శ్రీనివాస్, వసంత్‌రావు, విశ్వేశ్వర్, హరిప్రసాద్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మల్లేశం, గ్రామ విద్యాకమిటీ చైర్మన్ అశోక్, ఏఎన్ఎంలు పుష్పలత, అనిత, నవీన ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ టీచర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని గోపని వెంకటాపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని వైద్యుడు వికాస్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీహర్ష, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సంపూర్ణ, సిబ్బంది యాదయ్య, వెంకటేశం, స్వప్న, సంజయ్, సంతోష, నాగమణి తదితరులున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని రెడ్యా తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ హరికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, సర్పంచ్ రంగీలా, ఎంపీటీసీ లక్ష్మి తదితరులు ఉన్నారు.